వంతెన పూర్తయ్యేదెప్పుడో?



నత్తనడకన సాగుతున్న వంతెన పనులు

- రెండేళ్లుగా కొనసాగుతున్న పనులు
- అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని ప్రయాణం
- త్వరగా పూర్తి చేయాలని ప్రజల వేడుకోలు

సిరికొండ: మండలంలోని కొండాపూర్ సమీపంలో చిక్‌మాన్ వాగుపై వంతెన శిథిలావస్థకు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం వంతెన నిర్మాణానికి ప్రధానమంత్రి సడక్ యోజన పథకం కింద రూ.1046.49 లక్షలతో 2021లో మంజూరు చేసింది. కానీ పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. దీంతో ప్రజలు అవస్థల మధ్య ప్రయాణం సాగిస్తున్నారు.

మండల కేంద్రానికి దూరంగా..

చిక్‌మాన్ వాగుపై ఉన్న వంతెనపై గత కొన్ని ఏళ్ల క్రితం వంతెన నిర్మించారు. ఈవంతెన చిన్నగా ఉండడంతో వర్షకాలంలో వరద నీరు వంతెనపై నుంచి పారుతుంది. వంతెన అప్రోచ్ రోడ్డు పూర్తి కొట్టుకుపోవడం రాకపోకలకు ఇబ్బంది అవుతోంది. వాగు అవతల ఉన్న పోచంపల్లి, లచ్చింపూర్, కన్నాపూర్, కన్నాపూర్‌తండా, ముత్యాంపేట్ ప్రజలు మండల కేంద్రానికి రాలేని పరిస్థితి. ప్రజల ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం ఇదే వంతెన వద్ద నూతన వంతెన నిర్మించేందుకు నిధులు మంజూరు చేసింది.

ప్రమాదకరంగా ప్రయాణం..

వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో మండలంలోని ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. తమకు ప్రయాణ కష్టాలు దూరం అవుతున్నాయని సంబురపడ్డారు. కానీ వంతెన పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు ఇంక పూర్తి కాకపోవడంతో పలు గ్రామాల ప్రజలు వాగుపై ఉన్న శిథిలావస్థకు చేరిన పాత వంతెనపై ప్రయాణం సాగిస్తున్నారు. గత జూన్‌లో కురిసిన వర్షాలకు వంతెన అప్రోచ్ రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో తాత్కాలికంగా మొరం రోడ్డు వేశారు. రోడ్డు ప్రమాదకరంగా ఎత్తులో ఉండడంతో ప్రజలు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణం సాగిస్తున్నారు. ఇప్పటికైన సదరు కాంట్రాక్టరుపై చర్యలు తీసుకొని వంతెన నిర్మాణపు పనులు త్వరగా పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

త్వరగా నిర్మించాలి



కొండాపూర్ వాగుపై నూతన వంతెన త్వరగా నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. వంతెన నిర్మాణం పనులు నత్తనడకన సాగడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వంతెన పనులు త్వరగా జరిగేందుకు సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి.

– పాండు, పోచంపల్లి గ్రామస్తుడు

ఆటో నడపాలంటే భయంగా ఉంది



కొండాపూర్ వంతెనపై ఉన్న పాత వంతెనపై ఆటో నడపాలంటే భయంగా ఉంది. వంతెనపైకి ఆటోను ఎక్కించాలంటే భయపడుతున్నాం. ప్రయాణికులను ముందే ఆటోలోనుంచి దించి నడచి వెళ్లి వంతెన దాటిన తరువాత ఎక్కుమంటున్నాం. నూతన వంతెన పనులు త్వరగా పూర్తి చేయాలి.

– గుండాల రవికుమార్, లచ్చింపూర్, ఆటో డ్రైవర్

‘బీఆర్‌ఎస్‌కే ప్రజల మద్దతు’

కైలాస్‌నగర్: బీఆర్‌ఎస్‌కే ప్రజల మద్దతు ఉందని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని 49వవార్డులో శుక్రవారం ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, మేనిఫెస్టోను వివరించారు. కాలనీలో మహిళలు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే జోగు రామన్న నియోజకవర్గ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ప్రకాష్, సతీష్, ఇజ్జగిరి అశోక్, అంజాద్, రఘునాథ్ పాల్గొన్నారు.

‘బలిదానాలకు కాంగ్రెస్సే కారణం’

ఆదిలాబాద్: తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల బలిదానాలకు కాంగ్రెస్సే కారణమని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 10, 11వ వార్డుల్లో ప్రచారం చేశారు. ఆదిలాబాద్ అభివృద్ధి ప్రధాత ఎమ్మెల్యే జోగు రామన్నను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ, కౌన్సిలర్ పవన్ నాయక్, భూమన్న, ప్రశాంత్‌రెడ్డి, ఖలీమ్, మునీర్, గంగన్న, ఇంతియాజ్, భాస్కర్, లక్ష్మి, గీత పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న జోగు ప్రేమేందర్

బీఆర్‌ఎస్ విస్తృత ప్రచారం

ఆదిలాబాద్‌టౌన్: బీఆర్‌ఎస్ నాయకులు ఆదిలాబాద్ పట్టణంలో ఉదయం నుంచి రాత్రి వరకు విస్తృత ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జోగు రామన్నకు ఓటువేసి గెలిపించాలని కోరుతున్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆయా కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. మసీద్‌ల వద్ద ఎమ్మెల్యే జోగు రామన్న ముస్లింల, మత పెద్దల మద్దతు కోరారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటువేసి సీఎం కేసీఆర్‌ను గెలిపించాలని కోరారు.



ముస్లింలను ఆలింగనం చేసుకుంటున్న రామన్న

ఆదిలాబాద్‌రూరల్: బీఆర్‌ఎస్‌తోనే ప్రజల సంక్షేమం జరుగుతుందని మావల ఎంపీపీ దర్శనాల సంగీత, జెడ్పీటీసీ నల్ల వనితలు అన్నారు. శుక్రవారం మావల మండలంలోని బట్టిసావర్‌గాం పరిధిలో గల దుబ్బగూడలో ప్రచారం నిర్వహించారు. జోగు రామన్నను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఏవన్, నల్ల రాజేశ్వర్, రాగం గోవర్ధన్, రమేశ్‌గౌడ్, అశోక్ యాదవ్, అనిల్, మల్లేష్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను ప్రజలు గెలిపిస్తారు

- బోథ్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్‌జాదవ్

ఇచ్చోడ/నేరడిగొండ: బోథ్‌లో బీఆర్‌ఎస్‌ను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని బోథ్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్‌జాదవ్ అన్నారు. శుక్రవారం ఇచ్చోడ మండలంలోని కోకస్‌మన్నూర్, సాథ్‌నంబర్, ఇస్లాంనగర్, ముఖరా(బి), ముఖరా(కె), జల్దా, నవేగావ్, నర్సాపూర్, సిరిచెల్మ, మాన్కపూర్, నారాయణపూర్, సల్యాద, మల్యాల్ గ్రామాల్లో అలాగే నేరడిగొండ మండలంలోని లఖంపూర్ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్, బీజేపీ అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. ఎంపీపీ ప్రీతంరెడ్డి, కన్వీనర్ కృష్ణారెడ్డి, నాయకులు మెహరాజ్ అహ్మద్, గాడ్గేసూబాష్, పలు గ్రామల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



ఇచ్చోడ: ప్రచారం చేస్తున్న అనిల్‌జాదవ్

అనిల్ జాదవ్‌ను గెలిపించండి

నేరడిగొండ/గుడిహత్నూర్/తలమడుగు: నేరడిగొండ మండలంలోని లఖంపూర్, వాగ్ధారి, మాధపూర్, వెంకటాపూర్, కుంటాల(కె), కుంటాల(బి), పెద్దబుగ్గారం గ్రామాల్లో ఎంపీపీ రాథోడ్ సజన్ ప్రచారం చేపట్టారు. గుడిహత్నూర్ మండల కేంద్రంలో వారసంతో బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనిల్ జాదవ్‌ను గెలిపించాలని కోఆప్షన్ సభ్యుడు శేక్ జమీర్ కోరారు. బీఆర్‌ఎస్‌ను బలపర్చి సీఎం కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని సాహిత్య సామ్రాట్ అన్నాభావు సాఠే మనువడు సచిన్ సాఠే అన్నారు. మండల కేంద్రానికి వచ్చిన ఆయన స్థానిక ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తలమడుగు మండలంలోని కొత్తూర్, సుంకిడి గ్రామాల్లో అనిల్‌జాదవ్‌ను గెలిపించాలని బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం చేశారు.

ఆశీర్వదించండి.. అండగా ఉంటా

- ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాయల్ శంకర్

బేల: అసెంబ్లీ ఎన్నికల్లో ఆశీర్వదిస్తే అండగా ఉంటానని ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని జునోని, దహెగాం, వరూర్(కె), భవానీగూడ, పిఠగావ్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల సమయంలోనే కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులకు ప్రజలు గుర్తుకువస్తారని, ఆతర్వాత మర్చిపోతారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ తొమ్మిదిన్నర ఏళ్ల పాలనలో నిరుపేదలకు ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయలేదన్నారు. రైతులకు పూర్తి స్థాయి రుణమాఫీ కాలేదని తెలిపారు. తెలంగాణలో కేంద్ర నిధులతో రాష్ట్ర సంక్షేమ పథకాలు నడుస్తున్నాయన్నారు. ఆలోచించి, కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దత్తా నిక్కమ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాక్రే మురళీధర్, బోయర్ విజయ్, రాకేశ్, వాడయి వివేక్, ధర్నే జీవన్ పాల్గొన్నారు.



ఎడ్లబండిపై ప్రచారం చేస్తున్న పాయల్ శంకర్

గొల్ల కురుమలకు సముచిత స్థానం

ఆదిలాబాద్: గొల్ల కురుమలకు బీజేపీలో సముచిత స్థానం లభిస్తుందని ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన గొల్ల కురుమల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. నాయకులు ప్రఫుల్ యాదవ్, నారాయణ యాదవ్, రాఘవేంద్రనాథ్ యాదవ్, రాజు యాదవ్, శ్రీకాంత్ యాదవ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

- బోథ్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి 'సోయం'

ఇచ్చోడ: అవినీతి, అక్రమాలకు పాల్పడిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదించాలని బోథ్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సోయం బాపూరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కుమురం భీం చౌక్‌లో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడారు. పేదలకు డబుల్‌బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేదన్నారు. రైతులు పండించే పంటలకు ఫసల్‌బీమాను ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మాధవ్ అమ్టె, గుమ్మడి భీంరెడ్డి, జిల్లా కార్యదర్శి కొల్లూరి చంద్రశేఖర్, అరెల్లి మల్లేశ్, కొడప నగేశ్, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: మండల కేంద్రంతో పాటు సోన్‌పెల్లి, కోసుపటేల్ గూడలో సోయం బాపూరావు కూతురు కృష్ణవేణి ఎన్నికల ప్రచారం చేశారు. బీజేపీని గెలిపించి, మండలాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. నాయకులు గాయక్వాడ్ సురేశ్‌బాబు, బోయిన్‌వాడ్ అమోల్, తదితరులు పాల్గొన్నారు.



రోడ్‌షోలో మాట్లాడుతున్న సోయం బాపూరావు

తాంసి: భీంపూర్ మండలంలోని నిపానిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసిని రెడ్డి ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి కోసం ఒకసారి బీజేపీ అవకాశం ఇవ్వాలన్నారు. దేవారెడ్డి, మండల అధ్యక్షుడు రాకేశ్‌యాదవ్, రామారావు, అశోక్, నారాయణ, రెడ్డిరమేశ్ పాల్గొన్నారు.

బోథ్: మండలంలోని కౌఠ(బి) గ్రామంలో బీజేపీ నాయకులు అశోక్ రెడ్డి, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సోయం బాపూరావును గెలిపించాలని కోరారు.

బజార్‌హత్నూర్: గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని బోథ్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సోయం బాపూరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ మనేశ్వర్ నారాయణకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బత్తిని సుధాకర్, గజానంద్, చందు, నర్సింహులు పాల్గొన్నారు.

‘కంది’కి రాహుల్‌గాంధీ ప్రచారం చేయొద్దు

- స్వతంత్ర అభ్యర్థి సంజీవ్ రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డికి రాహుల్ గాంధీ ప్రచారం చేయవద్దని స్వతంత్ర అభ్యర్థి సంజీవ్ రెడ్డి, గండ్రత్ సుజాత, సాజిద్‌ఖాన్‌లు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి సీఆర్‌ఆర్ నివాసంలో మాట్లాడారు. రాహుల్ గాంధీ అనేక సభలు, సమావేశాల్లో ఆర్‌ఎస్‌ఎస్ భావాలు ఉన్న, పారాషూట్ నేతలకు టిక్కెట్ ఇవ్వమని చెప్పారని తెలిపారు. రేవంత్ రెడ్డి డబ్బులు తీసుకొని టిక్కెట్ అమ్ముకున్నారని ఆరోపించారు. శనివారం జరిగే రాహుల్ గాంధీ సభను రద్దు చేసుకోవాలన్నారు. ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి మూడో స్థానంలో నిలుస్తాడని, తాము గెలిచి రాహుల్ గాంధీ సమక్షంలో తిరిగి కాంగ్రెస్‌లో చేరుతామన్నారు. ఉంగరం గుర్తుకు ఓటు వేసి స్వతంత్ర అభ్యర్థి సంజీవ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. సమావేశంలో కౌన్సిలర్ అంబకంటి అశోక్, వసీమొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంజీవ్‌రెడ్డి, సాజిద్‌ఖాన్, గండ్రత్ సుజాత

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ రెబల్, స్వతంత్ర అభ్యర్థి అల్లూరి సంజీవ్‌రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని పలు కాలనీల్లోని మసీద్‌ల వద్ద ప్రచారం చేశారు. సంజయ్‌నగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు నవీన్ కుమార్ మద్దతు తెలిపాడు.

ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వండి

- ఆదిలాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి 'కంది'

కైలాస్‌నగర్: ఈఎన్నికల్లో అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తానని ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని బొక్కలగూడ అయేషా మసీదు, ఖుర్షీదునగర్ మహ్మదీయ మసీదు, చోటా తలాబ్‌లోని జామా మసీదులను సందర్శించారు. ముస్లిం మైనార్టీలను కలిసి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే హక్కుపత్రాలు

ఆదిలాబాద్‌రూరల్: అధికారంలోకి రాగానే ప్రతిఒక్క ఆదివాసీ కుటుంబానికి పోడు భూములకు హక్కుపత్రాలు ఇస్తామని జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భూపెల్లి శ్రీధర్ అన్నారు. శుక్రవారం మావల మండలంలోని వాఘాపూర్‌లో ఎన్నికల ప్రచారం చేశారు. కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, ధర్మపురి చంద్రశేఖర్, సంపేర్ల అడేల్లు, గోవర్ధన్ రెడ్డి, కుదురుపాక సురేశ్ పాల్గొన్నారు.

ప్రజల సేవకే రాజకీయాల్లోకి..

ఎదులాపురం: ప్రజా సేవ చేసేందుకే కంది శ్రీనివాస్ రాజకీయాల్లోకి వచ్చారని, సంపాదించేందుకు కాదని టీడీపీ నాయకులు అల్లూరి రాజారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో టీడీపీ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు.



ఓటు అభ్యర్థిస్తున్న కంది శ్రీనివాసరెడ్డి

గెలిపించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా

- ఖానాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్

ఖానాపూర్: ఎమ్మెల్యేగా ఖానాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్‌ఎస్ అభ్యర్థి భుక్య జాన్సన్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని దాసునాయక్‌తండా, బావాపూర్(ఆర్), రాజురా, చందునాయక్ తండా, సింగాపూర్, ఎక్బాల్‌పూర్, తర్లపాడ్, పాతతర్లపాడ్, సత్తనపల్లి, సేవానాయక్ తండా, రాంరెడ్డి పల్లె, బీర్నంది, రంగపేట గ్రామాల్లో ప్రచారం చేశారు. ఖానాపూర్ మండలంలోని పాతఎల్లాపూర్, గోసంపల్లె, గోడలపంపు, దిలావార్‌పూర్ గ్రామాల్లో శుక్రవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తిరుపతిగౌడ్, సంతోశ్‌గౌడ్, శ్రీనివాస్ ఉన్నారు.



ఖానాపూర్: బావాపూర్‌లో మాట్లాడుతున్న జాన్సన్

పెంబి: మండలంలోని పుల్గంపాండ్రి గ్రామంలో బీజేపీ నాయకులు శుక్రవారం ఏపీపీఎస్సీ మాజీ సభ్యుడు పైడిపెల్లి రవీందర్‌రావు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నరేందర్‌రెడ్డి, సర్పంచ్ తా నాజీ, గోవింద్, సరోజ, కాశీరాం ఉన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని తిమ్మాపూర్, ఖానాపూర్ మున్నూరుకాపు సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ దండె విఠల్‌తోపాటు బీఆర్‌ఎస్ అభ్యర్థి జాన్సన్ నాయక్‌ను శుక్రవారం సన్మానించారు. ఆయా సంఘ భవనాల్లో జరిగిన సమావేశాల్లో నాయకులు మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ను గెలిపించాలన్నారు.

జన్నారం: లంబాడా తండాలు ఏకమై జాన్సన్ నాయక్‌కు మద్దతు తెలపాలని ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని రూప్‌నాయక్ తండాలో ప్రచారం నిర్వహించారు. పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు.

ఉట్నూర్‌రూరల్: మండలంలోని దుర్గాపూర్ గ్రామంలో బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ ప్రచారం చేశారు. కల్యాణలక్ష్మి, రైతుబంధు, డబుల్ బెడ్‌రూం పథకాలను వివరించారు.

క్లుప్తంగా

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి

నార్నూర్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని మాజీ జెడ్పీటీసీ రూపావంతి జ్ఞానోబా పుస్కర్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఖంపూర్ గ్రామంలో అఖండ హరినామ సప్తహ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆధ్యాత్మికతతోనే మనశాంతి, ఐక్యత సోదార భావం ఏర్పడుతుందన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను ఈతరం యువతి, యువకులకు అందించాలన్నారు.

పుస్తకం మూఢనమ్మకాలు దూరం చేస్తుంది

ఆదిలాబాద్: డార్విన్ జీవుల పుట్టుక, వాటి పరిణామ క్రమం పుస్తకం మూఢనమ్మకాలను దూరం చేస్తుందని ఆదిలాబాద్ ఆర్ట్స్, కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జలగం అనిత అన్నారు. శుక్రవారం ప్రపంచ జీవ పరిణామ దినోత్సవాన్ని పురస్కరించుకొని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో డార్విన్ జీవ పరిణామం పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సూతుల రవీందర్, సభ్యులు ఉమాకాంత్, మెస్రం రాజు, అధ్యాపకులు చంద్రకాంత్, శ్రీనివాస్, ముజీబ్, సౌజన్య, నందిని పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫ్యాన్సీఫెట్ ఉత్సవాలు

నార్నూర్: విద్యార్థులకు సామాజిక అంశాలు, వ్యాపారంగంలో అవగాహన కల్పించేందుకు వారిలో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఫ్యాన్సీఫెట్ ఉత్సవాలు నిర్వహించినట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ చిన్నప్పారెడ్డి తెలిపారు. శుక్రవారం విద్యార్థులకు ఉన్న నైపుణ్యం ఆధారంగా ఆట వస్తువులు, బిర్యాణి హౌజ్, చైనీస్‌ఫుడ్, మిర్చిబజ్జీలు, మినీ సినిమా టాకీస్ స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ కాంబ్లే బాలాజీ, ఉప సర్పంచ్ చౌహాన్ మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

‘ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం’

గుడిహత్నూర్/తాంసి/బోథ్/నేరడిగొండ: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని సీనియర్ నాయకుడు అంకతి రవీందర్ అన్నారు. గుడిహత్నూర్ మండలంలోని తోషం, ఇన్కర్‌గూడలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. నాయకులు చట్ల మహేందర్, ససానే మాధవ్, షేక్ మజీద్, అవుల రమేశ్, సత్యనారాయణ, ఆడే జైపాల్ సింగ్, ఏక్‌నాథ్ పాల్గొన్నారు. తాంసి మండలంలోని గోట్కూరి గ్రామంలో ఆడే గజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వెంకట్ రెడ్డి, రాకేశ్‌యాదవ్, నారాయణ, దేవిదాస్, రాములు, రామన్న, చిన్న రాంరెడ్డి పాల్గొన్నారు. బోథ్ మండల కేంద్రంలో సీపీఐ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ ఆరు గ్యారంటీలను వివరించారు. గోవర్ధన్, నరేశ్, మున్సిఫ్, జునైద్, గోదావరి, గౌరీభాయ్, ఉన్నారు. సొనాల, గొల్లాపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. నేరడిగొండ మండలంలోని నాగమల్యాల్, పీచర, గోవింద్‌పూర్, మాట్‌లొద్ది, రోల్‌మామడ, దేవుల్‌నాయక్‌తండా, గాజిలి, మంగళిమోట గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేపట్టారు.



తాంసి: ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

విగ్రహ ప్రతిష్ఠాపన

బోథ్: మండలంలోని చింతగూడ గ్రామంలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ తుల శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన నిర్వహించారు. సర్పంచ్ లింగు, శ్రీధర్ రెడ్డి, విజయ్, సురేశ్, దేవేందర్, నాగేందర్, భీంరావ్, జుగాది రావ్, బాపూరావ్ పాల్గొన్నారు.

గాండ్ల సంఘం కమిటీని రద్దు చేస్తూ తీర్మానం

ఎదులాపురం: జిల్లా గాండ్ల సంఘం కమిటీని రద్దు చేస్తు శుక్రవారం కులస్తులు తీర్మానం చేశారు. అనంతరం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. సమస్యల పరిష్కరిచడంలో ప్రస్తుత అధ్యక్షుడు రాంప్రసాద్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. రెండు సంవత్సరాల నుంచి ఎలాంటి అభివృద్ధి, సమస్యలు పట్టించుకోలేదన్నారు. పాత కమిటీని ర ద్దు చేస్తూ నూతన కమిటీని ఎన్నుకోవడానికి తీర్మానించడం జరిగిందన్నారు. సమావేశంలో పిన్నాంవార్ రాజేశ్, తమ్ముళ్లవార్ చందు, తక్కల్లపల్లి విశ్వనాథ్, మహేందర్, నగేశ్, సంజు, మహేందర్, విలాస్, వెంకటేశ్, అర్జున్, సత్యనారాయణ, దేవన్న, విశ్వనాథ్ పాల్గొన్నారు.

27న పత్తి కొనుగోళ్ల నిలిపివేత

బేల: ఈనెల 27న కార్తీకపౌర్ణమి, గురునానక్ జయంతి పురస్కరించుకుని మండల కేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డు పరిధిలోని స్థానిక జిన్నింగ్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోళ్లు నిలివేస్తున్నట్లు జైనథ్ మార్కెట్ కమిటీ కార్యదర్శి కాంబ్లే మధుకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తె లిపారు. తిరిగి 28న పత్తి కొనుగోళ్లు చేపడుతా మన్నారు. రైతులు సహకరించాలని కోరారు.

‘రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి’

నేరడిగొండ: గిరిజన ఆరాధ్య దైవమైన సంత్‌శ్రీ సేవాలాల్ మహరాజ్‌ను అవమానించేలా వ్యవహరించిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని గిరిజన లంబాడాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గిరిజన సంఘాల నాయకులతో కలిసి శుక్రవారం నిరసన చేపట్టారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నారాయణఖేడ్ బహిరంగ సభలో సేవాలాల్ మహరాజ్ చిత్రపటం అందించేందుకు గిరిజనులు యత్నిస్తుండగా దాన్ని పక్కకు తోసేయడం సరికాదని మండిపడ్డారు. క్షమాపణ చెప్పకుంటే జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించే రాహుల్ గాంధీ సభను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో బోథ్ నియోజవర్గ ఇన్‌చార్జి సుజిల్ నాయక్, నాయకులు పరశురాం జాదవ్, భీంరావు జాదవ్, రాథోడ్ రమేశ్, రాథోడ్ సురేందర్, కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న గిరిజన సంఘాల నాయకులు